క్లుప్తంగా

టీడీపీని గెలిపిస్తే సంక్షేమ పథకాలు ఉండవు



ఎమ్మిగనూరు 30వ వార్డులో ప్రచారం చేస్తున్న బుట్టా ప్రతుల్

ఎమ్మిగనూరుటౌన్: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీని గెలిపిస్తే పేదలకు మళ్లీ కష్టాలు తప్పవని, సంక్షేమ పథకాలన్నీ నిలిచిపోతాయని వైఎస్సార్‌సీపీ నాయకుడు బుట్టా ప్రతుల్ పేర్కొన్నారు. ఆయన శుక్రవారం 30వ వార్డులో తల్లి బుట్టా రేణుకకు మద్దతుగా ఇంటింటి ప్రచారం చేశారు. వార్డు కౌన్సిలర్ చెన్నమ్మ, ఇన్‌చార్జ్‌లు కె.విశ్వనాథ్, పాలశ్రీనివాసరెడ్డితో కలిసి ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు (ఎంపీ, ఎమ్మెల్యే) వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. పార్టీ నాయకులు కోటకొండ నరసింహులు, విశ్వనాథ్‌రమేష్, ప్రతాప్‌రెడ్డి, మధు, శ్రీనివాసులు, పురుషోత్తం, రజాక్, తదితరులు పాల్గొన్నారు.

దొంగలను పట్టిచ్చిన గ్రామస్తులు

ఆస్పరి: మండలంలోని బిణిగేరి గ్రామంలో చోరీ చేసేందుకు వచ్చిన ఇద్దరిని గ్రామస్తులు పట్టుకుని ఆస్పరి పోలీసులకు అప్పగించారు. గురువారం రాత్రి ఇద్దరు దొంగలు ఒక ఇంట్లోకి ప్రవేశించి సెల్‌ఫోన్ దొంగలిస్తుండగా మెలకువతో ఉన్న ఇంటి యజమాని కేకలు వేశాడు. ఇరుగుపొరుగు వారు అప్రమత్తమై పరుగెడుతున్న దొంగలను పట్టుకున్నారు. అనంతరం ఆస్పరి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు వెళ్లి దొంగలను అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయంపై సీఐ హనుమంతప్ప మాట్లాడుతూ.. బిణిగేరి గ్రామస్తులు దొంగలను పట్టిచ్చిన మాట వాస్తవమేనని నిందితులను విచారిస్తున్నట్లు చెప్పారు.

అంగన్‌వాడీ కార్యకర్త మృతి



జయమ్మ (ఫైల్)

ఆస్పరి: ఆస్పరిలో అంగన్‌వాడీ–2 కార్యకర్తగా పనిచేస్తున్న జయమ్మ (52) అనారోగ్యంతో మృతి చెందినట్లు శుక్రవారం కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహాన్ని స్వగ్రామైన బిణిగేరికి తీసుకెళ్లారు. శుక్రవారం అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు శివలింగమ్మ, పద్మ, కార్యకర్తలు వెళ్లి జయమ్మ మృతదేహంపై పూలమాలు వేసి నివాళులర్పించారు. మృతురాలికి భర్త, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

నిబంధనలు పాటించండి



డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రమేష్‌బాబు

మద్దికెర: ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ రమేష్‌బాబు సూచించారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆటోడ్రైవర్లకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. సరైన రికార్డులు లేకపోతే కేసులు నమోదు చేస్తామన్నారు. లైసెన్సు ఉంటేనే వాహనం నడపాలన్నారు. ప్రస్తుతం వేసవి కాలం అయినందున టైర్లు బలహీనంగా వుంటాయని దీంతో టైర్లు పేలి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వివరించారు. వాహనాలకు నాణ్యమైన టైర్లు వేయించుకొని ప్రమాదాలను నివారించాలన్నారు.

9 నుంచి తిమ్మగురుడు స్వామి తిరునాల



తిమ్మగురుడు స్వామి ఆలయం

కృష్ణగిరి: మండల పరిధిలోని ఎరుకలచెర్వు గ్రామంలో కొండపై వెలసిన భక్తుల ఆరాధ్య దైవం తిమ్మగురుడు స్వామి తిరునాలను ఈ నెల 9వ తేదీ నుంచి వైభవంగా నిర్వహించనున్నట్లు గ్రామస్తులు శుక్రవారం తెలిపారు. గ్రామం మధ్యలో కొండపై వెలసిన తిమ్మగురుడు స్వామికి మంగళవారం ప్రతి ఇంటి నుంచి నేవైద్యం తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 10న ఉదయం 6 గంటలకు స్వామి ఉత్సవ విగ్రహాలను ప్రభపై ఉంచి ఊరేగించడం జరుగుతుందని, సాయంత్రం స్వామి వారికి పల్లకీసేవ ఉంటుందన్నారు. తిరునాల సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు. భక్తులు విరివిగా పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

చలివేంద్రం ఏర్పాటు

పత్తికొండ రూరల్: పత్తి కొండలోని పోలీసు స్టేషన్ ఎదురుగా ఉన్న బస్‌షెల్టర్‌లో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవా రం ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని తహసీల్దారు మాధవరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జాతీయ కార్యదర్శి ఆస్పరి శ్రీనివాసులు మాట్లాడుతూ.. మండువేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటుచేసినట్లు తెలిపారు. అధికారులు రామ్మోహన్, బి.రంగస్వామి, డీటీ లక్ష్మి నారాయణ పాల్గొన్నారు.

జగనన్నతోనే బీసీలకు సముచిత స్థానం

- సమాజానికి బ్యాక్‌బోన్ కులాలుగా గౌరవించారు
- వాల్మీకుల ఆత్మీయ సమావేశంలో బీవై రామయ్య, బుట్టారేణుక
- జగ్జీవన్‌రామ్‌కు ఘననివాళి



వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బీవై రామయ్య, బుట్టా రేణుక

ఎమ్మిగనూరు: రాష్ట్రంలో బీసీ కులాలకు ప్రత్యేక అవకాశాలు కల్పించి, వారిని బ్యాక్‌బోన్ కులాలుగా గౌరవించిన వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ కర్నూలు పార్లమెంట్ అభ్యర్థి బీవై రామయ్య, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మిగనూరులో జరిగిన వివిధ కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. వాల్మీకుల ఆత్మీయ సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీసీ కులాల అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ పథకాలు అమలుచేస్తూ వారు ఆర్థికంగా నిలుదొక్కుకొనేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేశారన్నారు. సంక్షేమ పథకాలే గాకుండా సామాజికంగా మరింత గౌరవం పెంచేందుకు ప్రభుత్వ, పార్టీ పదవుల్లో బీసీలకు 50 శాతం కోటా దక్కేలా చేశారన్నారు. కర్నూలు, అనంతపురం జిల్లాల్లో వాల్మీకి (బోయ) కులస్తులకు పార్టీ పరంగానే గాకుండా రాజ్యాంగ పదవుల్లో ప్రాధాన్యత ఇచ్చారని గుర్తుచేశారు. కుల దురహంకారంతో, కుట్రల అజెండాతో ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకమైనా, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం 'నా ఎస్సీ..నా ఎస్టీ..నా బీసీ..నా మైనార్టీ..' అంటూ బడుగులను బుజస్కందాలపై మోస్తూ, చేసిన మంచిని వివరిస్తూ ప్రజలే నా బలం..బలగం అంటూ ఎన్నికల పోరాటానికి సిద్ధమయ్యారని చెప్పారు. సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా.. గ్రామస్వరాజ్యంతో ఇంటింటికీ చేరువైన పాలన మరింత మెగుగవ్వాలన్నా వైఎస్ జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. మే 13న జరిగే సార్వత్రిక సమరంలో రెండు ఓట్లు (ఎంపీ, ఎమ్మెల్యే) ఫ్యాన్ గుర్తుపై వేయాలని కోరారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, బీసీ సంఘాల జాతీయ నాయకులు నక్కలమిట్ట శ్రీనివాసులు, బుట్టా శివ నీలకంఠప్ప, వాల్మీకి సంఘం జిల్లా నాయకులు వీజీఆర్ కొండయ్య, రఘు, నర్సరాజ్, మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ బుట్టా రంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ సేవలు జాతికే ఆదర్శం

అణగారిన వర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు భారతజాతికే ఆదర్శప్రాయమని మాజీ ఎంపీ బుట్టా రేణుక, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ పేర్కొన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ దేశ ఉపప్రధానిగా ఎన్నో సేవలందించారన్నారు. బడుగు బలహీన వర్గాలు, అణగారిన వర్గాల వారి అభ్యున్నతికి ఆయన విశేష కృషి చేశారన్నారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కుట్రల కూటమికి ఓటమి తప్పదు

ఎమ్మిగనూరుటౌన్: ఎన్ని కుయుక్తులు పన్నినా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, వారికి ఓటమి తప్పదని వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బీవై రామయ్య, బుట్టా రేణుకలు పేర్కొన్నారు. గోనెగండ్ల మండల పరిధిలోని గంజిహళ్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు గంజిలయ్య, బెస్త పెద్దసవారి, చిన్న సవారి, అరవ వీరనాయుడు, సోమన్న, బద్రి, రాజశేఖర్‌లతో పాటు బోయ, ఎస్సీ సామాజిక వర్గాలకు చెందిన పలువురు శుక్రవారం పట్టణంలోని కార్యాలయంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. గ్రామ సర్పంచ్ రాముడు, నాయకులు నాగేష్‌నాయుడు ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి ఎంపీ,ఎమ్మెల్యే అభ్యర్థులతో పాటు ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ కండువాలు కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో ఐక్యతతో పనిచేసి టీడీపీని చిత్తుగా ఓడించాలని దిశానిర్దేశం చేశారు.



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బుట్టా రేణుక, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమాభివృద్ధి

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీకి మరోసారి అధికారం అందించాలని ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టారేణుక విన్నవించారు. ఆమె శుక్రవారం సాయంత్రం పట్టణంలోని 23వ వార్డులో ఇన్‌చార్జ్‌లు తరుణ్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ, గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో వ్యత్యాసాన్ని పోల్చి చెబుతూ ఓట్లను అభ్యర్థించారు. జగనన్న సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం లబ్ధిపొందిందని చెప్పారు. సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని, స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు,

కర్ణాటక మద్యం స్వాధీనం



పట్టుబడిన మద్యంతో సెబ్ అధికారులు

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని అటికెలగుండు గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన కర్ణాటక మద్యం 1440 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని బోయ వెంకటరాముడు అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు పత్తికొండ సెబ్ సీఐ స్వర్ణలత శుక్రవారం తెలిపారు. సమాచారం మేరకు గ్రామంలో దాడులు నిర్వహించగా ఓ ఇంట్లో అట్టపెట్టెల్లో నిల్వ ఉంచిన మద్యంను గుర్తించామన్నారు. మద్యం స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ సుమారు రూ.90 వేలు ఉంటుందన్నారు. దాడుల్లో సెబ్ ఎస్‌ఐ కార్తీక్‌సాగర్, సిబ్బంది ఉన్నారు.

పంచాయతీ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు

మద్దికెర: మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామంలో చేదుడుబావి చుట్టూ స్థలాన్ని ఆక్రమించుకొని రోడ్డు వేయడంతో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో శుక్రవారం పంచాయతీ సిబ్బంది రోడ్డును తొలగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయుడు మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలాలు ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటామని ఎవరైన ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రెండు నెలల్లోనే హామీ నెరవేర్చారు



నాడు - మద్దికెర - మెలగవెళ్ల రోడ్డు దుస్థితి



నేడు - రాకపోకలకు సౌకర్యంగా ఉన్న తారు రోడ్డు

- రూ.8.50 కోట్లతో తారు రోడ్డు నిర్మాణం
- పనులు పూర్తికావడంతో గ్రామస్తుల హర్షం
- ఇచ్చిన హామీ నిలబెట్టుకున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

మద్దికెర: మండల కేంద్రం నుంచి ఆలూరు తాలుకాలోని మొలగవెళ్లి గ్రామానికి రూ.8.50 కోట్లతో తారు రోడ్డును నిర్మించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మద్దికెర నుంచి మొలగవెళ్లి మధ్య 14 కి.మీ దూరం ఉండగా ఒక్క గ్రామం కూడా లేదు. దూరంగా విసిరేసినట్టుగా ఉండే గ్రామానికి అడుగు వేయాలంటే సాధ్యం కాని రీతిలో దారి ఉండేది. గతంలో వేసిన రోడ్డు ఛిద్రం కావడంతో కంకర తేలి రాకపోకలకు ఇబ్బందులు ఎదుయ్యేవి. ఆ గ్రామస్తులకు ఇచ్చిన హామీ ప్రకారం జనవరి 3వ తేదీన రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి భూమి పూజ చేశారు. కేవలం రెండు నెలల్లోనే రోడ్డు వేయించి మాట నిలబెట్టుకన్నారు. రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలం నుంచి మొలగవెళ్లి, ఆలూరు, గూళ్యం, ఎల్లార్తి తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే ఈదారి గుండా వెళితే దాదాపు 20 కి.మీ దూరం తగ్గుతుంది. అంతేగాక మద్దికెర రైతులకు దాదాపు 30 ఎకరాలు వ్యవసాయ భూములు ఉన్నాయి. ప్రతి ఏటా వ్యవసాయ పనులకు, పంటలు సాగు చేసుకునేందుకు రోడ్డు సౌకర్యం సరిగా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడేవారు. నిత్యం ఈ రోడ్డుపై రాకపోకలు జరుగుతుంటాయి. హామీ ఇచ్చిన రెండు నెలల్లోనే రోడ్డు నిర్మాణం పూర్తవుతుందని అనుకోలేదని, రోడ్డు సమస్య పరిష్కారం కావడంపై మద్దికెర, మొలగవెళ్లి గ్రామస్తులు వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పొత్తు ధర్మానికి బీవీ తూట్లు

- ఎమ్మిగనూరులో బీజేపీ–టీడీపీ మధ్య పొసగని సఖ్యత

ఎమ్మిగనూరు రూరల్: నియోజకవర్గ టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బీవీ.జయనాగేశ్వరరెడ్డి పొత్తు ధర్మం పాటించడం లేదని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేఆర్.మురహరరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కూటమి అభ్యర్థి బీవీ ఏకపక్ష ధోరణితో వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. మార్చి 14న అభ్యర్థిగా బీవీ పేరును ప్రకటించగా 15వ తేదీన ఫోన్ చేసి తన గెలుపునకు సహకరించాలని కోరగా సమ్మతించినట్లు చెప్పారు. ఆ తర్వాత నుంచి తమను పట్టించుకోలేదని, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎమ్మిగనూరు పర్యటనలోనూ తమకు ఆహ్వానం అందలేదని చెప్పారు. దీనిపై బీవీ ప్రెస్‌మీట్‌లో.. చంద్రబాబు పర్యటనలో పాల్గొనాల్సిందిగా బీజేపీ నేతలకు ఆహ్వానం పంపినా రాలేదని చెప్పడం సిగ్గుచేటన్నారు. బీజేపీతో పాటు జనసేన పార్టీకి ఆహ్వానం అందలేదని చెబుతున్నారని, ఎమ్మెల్యే సీటు ఆశించిన మాచాని సోమనాథ్‌ను చంద్రబాబు పర్యటనలో ఘోరంగా అవమానించినట్లు కార్యకర్తలు చర్చించుకుంటున్నట్లు తెలిపారు. పార్టీ ఆదేశిస్తే ఫ్రెండ్లీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను పోటీకి సిద్ధమని, బీ–ఫారం వచ్చే వరకు ఎదురు చూస్తామని స్పష్టం చేశారు.

మహనీయులకు ఘన నివాళి



ఎమ్మిగనూరులో జగ్జీవన్‌రామ్, విజయరామరాజు చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఎస్టీయూ నేతలు



హొళగుంద వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు



దేవనకొండలో నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి, ఉపాధ్యాయ ఉద్యమ పితామహుడు వీణ విజయరామరాజు వర్ధంతి సందర్భంగా శుక్రవారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో ఆ సంఘ నాయకులు వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు ప్రసన్న రాజు మాట్లాడుతూ వారి సేవలను కొనియాడారు. ఎస్టీయూ నాయకులు అడివన్న, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: స్థానిక బస్టాండ్ సమీపంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం జగ్జీవన్‌రామ్ జయంతి ఘనంగా నిర్వహించారు. కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్ అధ్యక్షతన నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాలకు రిజర్వేషన్ ఫలాలు అందేలా, దళితుల హక్కుల కోసం, అంటరానితనం నిర్మూలన కోసం తన పదవికి రాజీనామా చేసి దళితుల ఘోష ప్రభుత్వాలకు వినిపించిన ఉన్నతమైన వ్యక్తి జగ్జీవన్‌రామ్ అని వక్తలు కొనియాడారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మహదేవ్, మారేష్, దస్తగిరి, హనుమంతు, మారెప్ప, నరసింహుడు తదితరులు పాల్గొన్నారు.

హొళగుంద: జగ్జీవన్‌రామ్ ఆశయాలను నెరవేర్చేందుకు ప్రతిఒక్కరు కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. శుక్రవారం హొళగుందలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా, నాయకులు ఈశా, మల్లికార్జున, కోగిలతోట శేషప్ప, ఎంపీటీసీలు మల్లి, హనుమప్ప, మల్లయ్య, రమేశ్, తదితరులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

తుగ్గలి: స్వాతంత్ర్య సమరయోధుడిగా, సంఘసంస్కర్తగా, రాజకీయవేత్తగా జగ్జీవన్‌రామ్ దేశానికి విశేష సేవలందించారని ఏపీఓ రామకృష్ణ కొనియాడారు. స్థానిక ఎంఎస్‌ఆర్ ఈజీఎస్ కార్యాలయంలో ఆయన చిత్రపటం వద్ద పూలుజల్లి నివాళుర్పించారు. ఈసీ ప్రదీప్‌కుమార్ ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

మద్దికెర: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి రెవెన్యూ అధికారి రంగస్వామి, సిబ్బంది పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే ఎస్సీ కాలనీలో ఎమ్మార్పీఎస్ నాయకులు జగ్జీవన్‌రాం జయంతి కార్యక్రమం నిర్వహించారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): స్థానిక ఎమ్మార్పీఎస్ నాయకులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆ సమితి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో గిడ్డయ్య, బజారు, సుధాకర్, మోషె, దేవదానం, పెద్దహరి, బాబి, ఏసు, కృష్ణ పాల్గొన్నారు.

దేవనకొండ: స్థానిక గ్రామ పంచాయతీలో జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమాన్ని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు జెగ్గల సుధాకర్, గుమ్మరాళ్ల అంజినయ్య, జయన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

తుగ్గలి: మండల పరిధిలోని చెర్వుతండాలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతుడు గుత్తి మండలం బసినేపల్లికి చెందిన షేక్ దాదాపీరా (45)గా గుర్తించారు. మృతుడి తల వెనుకవైపు రక్తగాయాలు ఉండడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతుడికి మద్యం సేవించే అలవాటు ఉంది. డీహైడ్రేషన్‌కు గురై కిందపడి మృతి చెంది ఉంటాడని కుటుంబ సభ్యులు తెలిపినట్లు జొన్నగిరి పోలీసులు పేర్కొన్నారు. మృతిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని జొన్నగిరి ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు.

మరో మహిళా కూలీ మృతి

- ఐదుకు చేరిన మృతుల సంఖ్య



వెంకటేశ్వరమ్మ (ఫైల్)

మద్దికెర: మార్చి 31వ తేదీన మిరప పంటను కోయడానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో మద్దికెర గ్రామ శివార్లలో ఉన్న కోతులమాను వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గొడుగు వెంకటేశ్వరమ్మ (55) చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందింది. దీంతో ప్రమాద మృతుల సంఖ్య ఐదుకు చేరింది. వాహనం టైరు పేలడంతో అదుపుతప్పి ప్రమాదం చోటుచేసుకోగా తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వరమ్మను మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. నాలుగు రోజులుగా వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతి చెందింది. మృతురాలికి భర్త గొడుగు ప్రభాకర్, కొడుకు, కూతురు ఉన్నారు.

తాగునీటి సమస్య తీర్చండి

ఎమ్మిగనూరురూరల్: నందవరం మండలం పొనకలదిన్నెలో తాగునీటి సమస్యను తీర్చాలని ప్రజా, దళిత సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మిగనూరులోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ రాష్ట్ర కన్వీనర్ లక్ష్మీనారాయణ, నవ్యాంధ్ర ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు రామతీర్థం అమరేష్, నరసప్ప, తిక్కన్న మాట్లాడుతూ గ్రామంలో 15 రోజులుగా తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు స్పందించడం లేదన్నారు. వేసవిలో నీటి సమస్య లేకుండా చూడాలని లేదంటే గ్రామస్తులతో కలిసి ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ముందు అందోళనకు దిగుతామని స్పష్టం చేశారు. గ్రామస్తులు వెంట ఉన్నారు.

గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు

దేవనకొండ: ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అల్లర్లు, గొడవలు సృష్టిస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని దేవనకొండ సీఐ శ్రీనివాసులు హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని పల్లెదొడ్డి గ్రామాన్ని ఆయన సందర్శించి ప్రజలకు చట్టాలపై, ఎన్నికల తీరుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎవరైనా ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసినా, గొడవలు చేసినా వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలైన పేకాట, మట్కా, నాటుసారా తయారీ, అక్రమంగా కర్ణాటక మద్యం సరఫరా చేస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు. పోలీసు సిబ్బంది ఉన్నారు.



పల్లెదొడ్డిలో ప్రజలతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసులు

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



పార్టీలో చేరిన కార్యకర్తలతో విరూపాక్షి

ఆలూరు రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఆలూరు నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విరూపాక్షి హామీ ఇచ్చారు. ఆయన శుక్రవారం మండలంలోని మనేకుర్తి, అంగస్కల్, గోనేహాల్ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ పాలనలో కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాయని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాట ఇస్తే తప్పక నెరవేరుస్తారని స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేత చంద్రబాబుకు ప్రజల్లో ఆదరణ కరువైందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే మరోసారి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. జిల్లా జేసీఎస్ కన్వీనర్ సురేందర్ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ ఈరన్న, సీనియర్ నాయకులు మల్లికార్జున రెడ్డి, సొమ్మ్యా రెడ్డి, కో–కన్వీనర్ వీరేష్, నాయకులు వీరభద్రారెడ్డి, నాగరాజు, శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

అంగస్కల్ గ్రామానికి చెందిన 10 కుటుంబాల వారు ఎమ్మెల్యే అభ్యర్థి విరూపాక్షి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. శుక్రవారం విరూపాక్షి ఆ గ్రామంలో నిర్వహించిన ఇంటింటి ప్రచార కార్యక్రమంలో దూదేకొండ వెంకప్ప, రామన్న, శ్రీనివాసులు, వెంటరాముడు, వెంకటేష్, హనుమంతు కుటుంబ సభ్యులు పార్టీలో చేరగా కండువాలు వేసి సాధరంగా ఆహ్వానించారు.



అంగస్కల్‌లో మహిళలను ఓటు అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విరూపాక్షి

ముస్లింలకు ఇఫ్తార్ విందు

ఆలూరు: స్థానిక జామియా మసీదులో శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుసినె విరూపాక్షి ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముందుగా మసీదులో ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన స్వయంగా భోజనం వడ్డించారు. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ముస్లింపెద్దలు ఆయన్ను శాలువాతో సన్మానించారు. జామియా మసీదు కమిటీ పెద్దలు, వైఎస్సార్‌సీపీ నాయకులు రామాంజనేయులు, మల్లికార్జున, ఈరన్న, మారయ్య, ముస్లింలు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్న ఆలూరు సీఐ, ఎస్‌ఐ

హొళగుంద: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాలలో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు, హొళగుంద ఎస్‌ఐ పెద్దయ్యనాయుడు హెచ్చరించారు. శుక్రవారం సీఐ ఆధ్వర్యంలో పెద్దగోనెహాళ్, వందవాగిలి, గజ్జహళ్లి, ఎల్లార్తి, ఎండీ హళ్లి తదితర గ్రామాలలో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సమస్యాత్మక గ్రామాలలో పర్యటించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారికి హెచ్చరికలు జారీ చేయడం, ప్రజలకు రక్షణగా ఉన్నామని ధైర్యం కల్పించేందుకు ఈ కవాతు నిర్వహించినట్లు సీఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో ప్రజలతో మాట్లాడారు. ప్రజలకు ఇబ్బంది పడకుండా ప్రశాంతంగా జీవించేందుకు పోలీసులు అండగా ఉంటారన్నారు. గొడవలు, బెదిరింపులకు దిగడం, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

వెల్లివిరిసిన మతసామరస్యం



ఇఫ్తార్ విందులో భాగంగా లడ్డూ పంపిణీ చేస్తున్న దృశ్యం

వెల్దుర్తి(కృష్ణగిరి): రంజాన్ మాసం పురస్కరించుకుని ఉపవాస దీక్షలో ఉన్న పట్టణ ముస్లింలకు బ్రహ్మగుండం ఆలయ ప్రధాన అర్చకులు యార్లపాటి శ్రీధర్‌శర్మ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. శుక్రవారం జామీయా మసీదులో ఉపవాస దీక్ష విరమించే సమయంలో ముస్లింలకు భోజనాలు ఏర్పాటు చేసి కుటుంబసభ్యులతో కలిసి వడ్డించారు. మత సామరస్యాన్ని చాటుతూ పండితుడు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందును ఆరగించిన ముస్లింలు సంతోషం వ్యక్తం చేశారు. ఏటా ఆయన రంజాన్ మాసంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తుండడం విశేషం.